బెజ్జూర్ పీఏసీఎస్‌లో గందరగోళం

- రుణాలు చెల్లించినా ఆన్‌లైన్‌లో నమోదు చేయని అధికారులు
- ఫలితంగా అర్హులైనా రుణమాఫీకి నోచుకోని రైతులు
- ఆందోళనలో అన్నదాతలు

బెజ్జూర్: బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ బ్యాంక్ ద్వారా రుణాలు పొందిన రైతులు వాటిని తిరిగి చెల్లించినప్పటికీ ఆన్‌లైన్‌లో మాత్రం చెల్లించనట్లుగా చూపిస్తోంది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల మూడు విడతల్లో ప్రభుత్వం పంట రుణమాఫీ చేయగా బెజ్జూర్ సొసైటీ బ్యాంక్‌లో మాత్రం అంతా గందరగోళం చోటు చేసుకుంటుంది. సహకార సంఘం ద్వారా గతంలో రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించి విడతలవారీగా కట్టిన రశీదులు సైతం వారి వద్ద ఉన్నాయి. సంబంధిత బ్యాంకుల్లో మాత్రం కట్టనట్లుగా చూపడంతో రైతులు లబోదిబోమంటున్నారు.


సహకార సంఘం కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

మృతుల పేరిట రుణం ఇచ్చిన అధికారులు..
బెజ్జూర్ మండలం కుకుడా గ్రామానికి చెందిన ఎండీ మహమ్మద్ 2015లో మృతి చెందాడు. అతను 2017లో రూ.13వేల పంట రుణం తీసుకున్నట్లు బ్యాంక్ అధికారులు చెబుతున్నారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్‌కు చెందిన తాళ్లపల్లి రామాగౌడ్ 2018లో మృతి చెందగా అతను 2022లో రుణం రెన్యూవల్ చేసినట్లు బ్యాంక్‌లో ఆధారాలు కనిపిస్తున్నాయి. దీంతోపాటు బెజ్జూర్ మండలం సలుగుపెల్లికి చెందిన గట్టు లలిత పేరిట ఆమెకు తెలియకుండా వ్యక్తిగత రుణం రూ.40వేలు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. చింతలమానెపల్లి మండలం కర్జల్లికి చెందిన రైతు లచ్చయ్య రూ.లక్షా 80వేల రుణం తీసుకుని గత సంవత్సరమే కట్టినప్పటికీ ఆన్‌లైన్‌లో కట్టనట్టు చూపిస్తోంది. దీంతో రుణమాఫీ జరగలేదు. చింతలమానెపల్లి మండలం కర్జల్లికి చెందిన డోకే హనుమంతు గతంలో తీసుకున్న రుణం గత సంవత్సరమే చెల్లించినప్పటికీ తన పేరిట రూ.3లక్షల రుణం బాకీ ఉన్నట్లుగా బ్యాంక్ అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

బెజ్జూర్ మండల కేంద్రంలోని సహకార సంఘంలో 3 వేల మంది సభ్యులుండగా 1900 మంది రైతు రుణాలు తీసుకున్నారు. మొదటి విడత 648 మందికి, రెండో విడత 235 మందికి, మూడో విడత 175 మందికి రుణమాఫీ అయ్యింది. అయితే చాలా మంది రుణాలు చెల్లించినప్పటికీ ఆన్‌లైన్‌లో మాత్రం చెల్లించనట్లుగా చూపిస్తోంది. మరికొంత మంది రుణాలు తీసుకోని వారు మృతి చెందినప్పటికీ వారు రుణాలు తీసుకున్నట్లుగా ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. దీంతో బాధిత కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి.

రైతుల బాధలు పట్టని అధికారులు..
గతంలో పంట రుణాలు తీసుకున్న రైతులు తిరిగి చెల్లించినా కొంతమందికి బ్యాంకులో మళ్లీ అప్పులు చూపుతున్నారు. రుణం చెల్లించినట్లు రశీదులు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో మాత్రం చూపించడం లేదు. దీంతో తమ బాధను ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. బెజ్జూర్ మండలంలో వందలాది మంది రైతులు రుణా లు తీసుకున్న వారు తిరిగి చెల్లించినప్పటికీ అధికా రుల అలసత్వం కారణంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదు. ఫలితంగా చాలా మంది రైతులు రుణమాఫీకి నోచుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం



సాంకేతిక కారణాలతో రుణాలకు సంబంధించి డబ్బులు చెల్లించిన రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రశీదులు ఉన్నవారి పేర్లను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం. వారం రోజుల్లో అందరి సమస్యలు పరిష్కరిస్తాం.

– సంజీవ్ కుమార్, సొసైటీ సీఈవో

రుణమాఫీకి నోచుకోలేదు



సొసైటీలో గతంలో తీసుకున్న రుణం ఐదు నెలల క్రితం పూర్తిగా చెల్లించా. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం చెల్లించనట్లు చూపిస్తోంది. ఇప్పుడేమో నాకు రూ.2లక్షల కంటే పైబడి రుణం చూపిస్తుండడంతో రుణమాఫీ జరగలేదు. దీంతో అర్హులైనప్పటికీ రుణమాఫీకి నోచుకోలేకపోయా.

– విజయ, సలుగుపల్లి

బకాయి చూపిస్తోంది



గతంలో సొసైటీ ద్వారా రుణం తీసుకున్నా. అయితే ఆ రుణం డబ్బులు పూర్తిగా ఏడాది క్రితమే చెల్లించా. దానికి సంబంధించి రశీదు సైతం తీసుకున్నా. అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో రూ.3 లక్షలు బకాయి ఉన్నట్లుగా చూపుతోంది.

– డోకే హనుమంతు, కర్జల్లి, చింతలమానెపల్లి

క్లుప్తంగా

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అధ్యాపకులు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఎస్సై రమేశ్ బాధ్యతల స్వీకరణ


రమేశ్

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణ ఎస్సైగా ఢీకొండ రమేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిర్పూర్ (టి) పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన రమేశ్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని బారే కాలనీకి చెందిన చౌదరి రమేశ్ పంట పొలంలో పనులు చేస్తూ ఇటీవల పిడుగు పాటుతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు నాగు పటేల్, మిత్రబృందం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. తానాజీ, రజాక్, సాజిద్, మారుతి, సాగర్, సుజాయత్ ఖాన్, అజయ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

లింగాపూర్: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి మంద్రు సురేశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రెయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రామేశ్వర్‌రావు, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో చంద్రయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కెరమెరి: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్ నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖాళీస్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. ఏపీవో మల్లయ్య, గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు పాల్గొన్నా రు.

ఒడ్డుగూడలో వైద్యశిబిరం

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన నిత్య, జననీ ఆస్పత్రుల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సుష్మితరెడ్డి, పూజిత సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగర్‌గూడలో..
పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడలో బుధవారం పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 57 మందిని పరీక్షించి 11 మంది జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మాధూరి, హెచ్ఏ ధర్మరావు, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కెరమెరి: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంఎన్‌వో అడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని మెట్టపిప్రి పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ద్వారా బోధన సాగించాలని సూచించారు. తమకు ఇష్టం వచ్చినట్లు రాకపోకలు సాగిస్తే కుదరదన్నారు.

‘ప్రైవేటు పాఠశాలల్లో నాణ్యమైన విద్య’

రెబ్బెన: తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ అధ్యక్షుడు పెద్దపెల్లి కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రైవేటు పాఠశాలల ఎన్నికలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి రాజేంద్రప్రసాద్, నాయకులు అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, జితేష్ సితానీ, ఇప్ప పోచయ్య, ఢీకొండ సంజీవ్‌కుమార్, మల్లిక్, రఘుపతి, శైలజ, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు

వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యుల సమావేశం

రెబ్బెన: వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యులు బుధవారం బెల్లంపల్లి ఏరియా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం శ్రీనివాస్, అన్ని విభాగాల అధిపతులు సమావేశంలో పాల్గొన్నారు. జీఎం (ఐఅండ్‌పీఎం) (కార్పొరేట్) రవికుమార్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత కోసం అవసరమయ్యే యంత్రాలు, పరికరాల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో నరేందర్, ఉమాకాంత్, ఏజీఎం భీంరావు జాటే, డీజీఎం కృష్ణమూర్తి, పీఈ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల రక్షణకు పటిష్ట చర్యలు
సింగరేణి ఉద్యోగుల రక్షణకు యజమాన్యం పటిష్ట చర్యలు చేపడుతోందని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్‌తో కలిసి ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో ఉద్యోగుల రక్షణకు యాజమాన్యం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఆర్జీ రీజియన్ జీఎం సేఫ్టీ గుప్తా, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో నరేందర్, మేనేజర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలి


అవినీతి ఆరోపణపై చర్చిస్తున్న సభ్యులు

రెబ్బెన: రెబ్బెన పీఏసీఎస్‌లో రైతుల రుణాల మంజూరులో వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు, రైతుల ఆందోళన నేపథ్యంలో బుధవారం పీఏసీఎస్ పాలకవర్గం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఈవో సంతోష్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు, రైతులు అందించిన ఫిర్యాదుల నేపథ్యంలో పాలక వర్గ సమావేశంలో చర్చించి డీసీవో ఆదేశాల మేరకు తీర్మానం చేసి సీఈవోను విధుల్లో నుంచి తొలగించారు. ఈ సందర్భంగా చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ విచారణ అధికారులకు సహకరించాలని కోరారు. అవినీతికి పాల్పడినట్లు తేలితే ఎంతటి వారినైనా ఉపేక్షించేదీ లేదని, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. సీఈవో సంతోష్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు పీఏసీఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, సభ్యులు కొవ్వూరి శ్రీనివాస్, మల్లయ్య, శంకరయ్య, లక్ష్మి, వెంకటేశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం పేరుతో జరిగిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టి భాద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ బుధవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల బిల్లులు రూ.70లక్షలు, ఇంకుడు గుంతల బిల్లులు రూ. 24 లక్షల వరకు దుర్వినియోగం అయ్యాయన్నారు. అప్పటి ఎంపీడీవో, ఈజీఎస్ ఏపీఎం, గోలేటి సర్పంచ్, ఉప సర్పంచులు కుమ్మక్కై నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్, నాగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

వాంకిడి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన వీవోఏల విస్తృత సమావేశంలో మాట్లాడారు. వీవోఏల సమ్మె సమయంలో కాంగ్రెస్ నాయకులు అనేక వాగ్దానాలు చేశారని, ఆ నాయకులు ప్రస్తుతం ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఉన్నారన్నారు. హామీ ప్రకారం కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని అన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా స్వాతి, సంతోష్, కార్యవర్గ సభ్యులుగా జుగాదిరావు, రాజేశ్వరి, శంకరమ్మ, యశోద, ధన్‌రాజ్‌ను ఎన్నుకున్నారు.

డబ్బాలో పర్యటించిన కలెక్టర్


పాఠశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

చింతలమానెపల్లి: కలెక్టర్ వెంకటేశ్ దోత్రే బుధవారం మండలంలోని డబ్బా గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల వినతి మేరకు పాఠశాలను పరిశీలించారు. మన ఊరు మనబడి పథకం కింద వచ్చిన నిధులతో పనులు పూర్తి చేయలేదని, పాఠశాలలో వసతులు లేవని పాఠశాల వద్ద చికెన్ సెంటర్లతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి వివరాలు తనకు త్వరగా నివేదించాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి వసతులు లేని పరిస్థితుల్లో మొక్కలు నాటడం వద్దని నిరాకరించారు. పాఠశాలలో పనులు పూర్తి చేసి మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో కోట ప్రసాద్, గ్రామస్తులు ఉన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి


మొక్క నాటుతున్న డీఆర్‌డీవో

జైనూర్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. బుధవారం మండలంలోని పట్నాపూర్‌లో ఆయన అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఉపాధి హామి పథకం కింద చేపడుతున్న నీలగిరి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న భూముల్లో నీలగిరి లాంటి మొక్కలను సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో రామకృష్ణ, మండల నోడల్ అధికారి మల్లేశ్, మాజీ ఎంపీపీ తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి
కాగజ్‌నగర్ రూరల్: మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని మంచిర్యాల అటవీశాఖ ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీఓ వేణుబాబు అన్నారు. బుధవారం కోసినిలోని సంపన్న వనాలు, ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్‌వో రమాదేవి, ఎఫ్ఎస్ఓలు కామరాజు, రవి, ఎంపీడీఓ రమేశ్, ఏపీఓ సోహెబ్, ఎఫ్‌బీఓ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలి
రెబ్బెన: భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు నేటితరం కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఖైరిగూడ ఓసీపీ వద్ద వన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జన్మదినం, వివాహ వార్షికోత్సవం, అమ్మకోసం వంటి కార్యక్రమాల్లో ఒక మొక్కను నాటాలని సూచించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో నరేందర్, అధికారుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పడిగాపులు


అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రీలత

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని బాలాజీ అనుకోడ రైతువేదిక వద్ద బుధవారం రైతులకు పడిగాపులు తప్పలేదు. రుణమాఫీ పథకం అమలులో తలెత్తిన సమస్యల పరిష్కారానికి ఉదయం 10గంటలకు అవగాహన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు అధికారులు ప్రకటించారు. బుధవారం ఉదయం 10గంటలకే గూడెం, దిందా, తదితర గ్రామాల రైతులు రైతువేదిక వద్దకు చేరుకున్నారు. గంటపాటు ఎదురు చూసినా వ్యవసాయ అధికారులు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 గంటలకు చేరుకున్న ఏఈవో శ్రీలత రైతుల నుంచి అర్జీలు స్వీకరించి సందేహాలు నివృత్తి చేశారు. దీనిపై ఏవో రామకృష్ణను వివరణ కోరగా.. మండలంలో ఏఈవోలు పూర్తిస్థాయిలో లేరని, బుధవారం బంద్ కారణంగా నోడల్ అధికారులు సకాలంలో రైతువేదికకు చేరుకోలేకపోయారని తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు రైతువేదిక వద్ద అన్నదాతల సమస్యలు తెలుసుకున్నారు. అర్హత గల ప్రతీ రైతుకు రుణమాఫీ అమలు చేస్తామని తెలిపారు.

జిల్లాలో బంద్ ప్రశాంతం


వాంకిడి: వినతిపత్రం ఇస్తున్న నాయకులు


బెజ్జూర్: కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు


కౌటాల: రాస్తారోకో చేస్తున్న నాయకులు

వాంకిడి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా దళిత సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ బుధవారం మండల కేంద్రంలో విజయవంతమైంది. వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, బ్యాంకులు బంద్ పాటించాయి. దళిత సంఘాల నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ మహోల్కర్, జైరాం ఉప్రే, విజయ్ ఉప్రే, విలాస్ ఖోబ్రగడె, ప్రతాప్, దీపక్, రోషన్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన బంద్ ప్రశాంతంగా బుధవారం జరిగింది. నాయకులు దుకాణ సముదాయాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలను బంద్ చేయించారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు.

కౌటాల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే సవరించాలని మహార్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల పిలుపు మేరకు ప్రకటించిన భారత్ బంద్‌లో భాగంగా మండలంలో సంపూర్ణ బంద్ పాటించారు. ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మహార్ సంఘం తాలుకా అధ్యక్షులు బండురావు, మండలాధ్యక్షులు పత్రు, నాయకులు మోతీరాం, వెంకటేశ్, కిశోర్, జానకిరావ్, కుశబ్‌రావు, సోమయ్య, ఆగయ్య, శంకరయ్య, అశోక్, శంకర్, ఏమాజీ, సురేష్. తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ‘వర్గీకరణ వద్దు పాత పద్ధతి ముద్దు’ అంటూ నినదించారు.

‘అధికారుల నిర్లక్ష్యంతోనే కబ్జాలు’

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అధికారుల నిర్లక్ష్యంతోనే కబ్జాలు కొనసాగుతున్నాయని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యక్రమ కోఆర్డినేటర్ గోలెం వెంకటేశం అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములు అన్యాక్రాంతమవుతున్నప్పటికీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం తగదన్నారు. ఎన్టీఆర్ చౌక్‌లోని సర్వేనెం.147/2, నిర్వాసితుల కోసం కేటాయించిన సర్వే నెం.143, తహసీల్దార్ కార్యాలయం వెనుకాల మరో స్థలం కబ్జాకు గురైందన్నారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చేరాల శ్రీనివాస్, నాయకులు రాములు, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీచర్లను సొంత జిల్లాకు బదిలీ చేయాలి

బెజ్జూర్: స్థానికేతర ఉపాధ్యాయులను సొంత జిల్లాకు బదిలీ చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎటుకూరు శ్రీనివాస్ రావు అన్నారు. పీఆర్టీయూ టీఎస్ బెజ్జూర్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంటేకీ తిరుపతి, మౌల్కర్ సుభాష్ ఆధ్వర్యంలో మండలంలోని సలుగుపల్లి, పాపన్నపేట తదితర పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల ఖాళీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే నియమించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 2004 నుంచి ప్రవేశపెట్టిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునర్ధరించాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చి దాదాపు 900 మంది స్థానికేతర ఉపాధ్యాయులు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేస్తున్నారని, వారిని వెంటనే వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. సంతోష్, రాహుల్, సమత, కవిత, శ్రీలత, పూనేష్, జితేందర్, శ్యాం, ముకుంద్, రఘునాథ్, విజయ్, నర్మద, ఇందిరా పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ చిట్టిబాబు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎస్సై చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, మాజీ ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, నాయకులు సుదర్శన్‌గౌడ్, గాజుల రవీందర్, లావుడ్య రమేశ్, జహురోద్దీన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాగజ్‌నగర్ రూరల్: మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో మున్సిపల్ సీఅండ్ఎండీ గౌతంకు మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగీర్ అహ్మద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు వసీం, మహబూబ్, సిద్దం శ్రీను, ఎసాన్, తదితరులు ఉన్నారు.

సమీక్షా సమావేశం

పెంచికల్‌పేట్: మండల కేంద్రలోని రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు బుధవారం మండల పరిషత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.